

బంగారు అంబారీపై ఊరేగుతున్న నాడదేవత చాముండేశ్వరి దేవి

రాజసం..!

• రాచనగరిలో సందడి • వైభవంగా మైసూరు దసరా ఉత్సవాలు
• అంబారీని గంభీరంగా మోసిన అభిమన్యు • లక్షలాదిమంది భక్తుల భాగస్వామ్యం

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన మైసూరు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. రాచనగరి మైసూరులో రాజసం చాటుకుంది. గురువారం ఉదయం నుంచి రాత్రి దాకా మైసూరు వీధులు జనసందడితో కనిపించాయి. గురువారం ఉదయం 9 గంటలకే ప్యాలెస్ ప్రాంతానికి ప్రజల రాక ప్రారంభమైంది. మధ్యాహ్నం 1 గంటకు నంది ధ్వజానికి సీఎం సిద్దరామయ్య పూజలు చేశారు. అనంతరం గజరాజులతోపాటు 64 శకటాలు, 112 కళాబృందాల ద్వారా 1480 మంది కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేకం అనిపించాయి. గాంధీ జయంతి, సత్యాగ్రహం, శ్రమదానం, రాష్ట్రపిత, స్వచ్ఛతా కార్యక్రమం, రాజ్యాంగ పీఠికతోపాటు ఐదు గ్యారెంటీలకు సంబంధించి ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. కళాబృందాల ప్రదర్శనలు సాగుతుండగా వర్షం కురవడంతో జంబూసవారి చూసేందుకు వచ్చిన వేలాదిమంది తడుస్తూనే అమ్మవారి దర్శనం కోసం వేచియున్నారు. సాయంత్రం ప్యాలెస్ నుంచి అభిమన్యు అంబారీని మోసుకుంటూ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే వేలాదిమంది జేజేలతో స్వాగతించారు. ప్యాలెస్‌ను చుట్టి ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంది. సాయంత్రం 4.30 గంటలకు కుంభలగ్నంలో ప్యాలెస్ ముందు అంబారీపై వచ్చిన చాముండేశ్వరి దేవికి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, యువరాజు యదువీర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభు బక్రు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సీమాలాట్కర్ సహా అధికారులు పుష్పార్చన చేశారు. అభిమన్యు వెంట కుడివైపు కావేరి, ఎడమవైపు రూప గజరాజులు వస్తుండగా ఓ గంభీరత్వం అనిపించింది. ప్రజల జేజేలు కళాబృందాల డప్పుల వాయిద్యంలోనూ తొణకకుండా బెదరకుండా అభిమన్యు ముందుకు కదిలింది. దీంతో జంబూసవారీ వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్యాలెస్ ప్రాంగణంలో సుమారు 50వేలమంది వీక్షించేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. అంతకు నాలుగు రెట్లకుపైగా మైసూరు వీధుల్లో అంబారీని తిలకించారు.



పట్టపు కత్తితో యువరాజు యదువీర్



అమ్మవారికి నమస్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

పాసులు ఉన్నా.. ప్యాలెస్‌లోకి వెళ్లలేకపోయారు

దసరా సందర్భంగా ముందస్తుగా గోల్డ్‌పాసులు పొందియున్నా స్థలం లేకపోవడంతో గేట్‌లు మూసివేశారు. దీంతో పలువురు సందర్శకులు నిరాశ చెందారు. అక్కడే గేట్‌ల వద్దనే పాస్‌లు చించి నిరసన తెలిపారు. గోల్డ్‌కార్డుకు రూ.6,500 చెల్లించామని, అయినా లోపలికి వదలలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



వానకు తడవకుండా.. గొడుగుల కింద సీఎం, డీసీఎం తదితరులు



అభిమన్యు వెంట గజరాజులు

తోపులాటలో పలువురికి గాయాలు

జంబూసవారి వేళ ప్రతిచోటా తోపులాట జరిగింది. చిన్నగడియారం సర్కిల్ వద్ద తోపులాటలో 50మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించారు. దేవరాజ్ మార్కెట్, ఆయుర్వేద ఆసుపత్రితోపాటు సయ్యాజి రావ్ రోడ్డుతోపాటు పలుచోట్ల జనం కిక్కిరిసి కనిపించారు. పోలీసులు భారీగా ఏర్పాట్లు చేసినా పలుచోట్ల ప్రజలను కట్టడి చేయడం సాధ్యం కాలేదు.



గాంధీజీ జీవితంపై శకటం

ఆకట్టుకున్న దివిటీల ప్రదర్శన

జంబూసవారి ముగిశాక బన్నిమంటపంలో ఏర్పాటు చేసిన దివిటీల ప్రదర్శన వర్ణరంజితం అనిపించింది. ఆకాశంలో 3వేల డ్రోన్లు వివిధ రూపాల్లో ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయపక్షి నెమలి, ప్రాణి పులి, డాల్ఫిన్, గరుడు, శ్రీకృష్ణ కాళీయమర్ధనం, సీఎం, డీసీఎంల చిత్రాలతోపాటు ప్రదర్శనలు సాగాయి. అశ్వదళం పోలీసులు ఫైర్ జంపింగ్, ఫగ్గింగ్ వంటి సాహసదృశ్యాలను దివిటీల ప్రదర్శన ఆకట్టుకుంది.



అమ్మవారి రూపంలో కళాకారిణి

కళాబృందాల ప్రదర్శన

దసరా ఉత్సవాల్లో శకటాలు, కళాబృందాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి. శకటాలలో ప్రధానంగా మైసూరు శాండల్‌సోప్స్, గాంధీ స్వచ్ఛతా, అటవీ సంరక్షణ, కాఫీనాడు, గోమటేశ్వర, డ్రగ్స్ రహిత భారత్, రాజ్యాంగ రక్షణ, గ్యారెంటీల్లో యువనిధి, శక్తి గ్యారెంటీ, అన్నభాగ్య వంటి శకటాలు, కాలుష్యనియంత్రణ మండలి, గ్రామపంచాయతీ కార్యాలయం, నైపుణ్యత, బ్రాండ్ బెంగళూరు, వన్యప్రాణుల రక్షణ, మల్బరీ సాగు వంటి శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాబృందాల్లో డొళ్ళు కుణిత, వీరగాసెతోపాటు ప్రతి జిల్లాకు ఒకటి రెండు కళాబృందాలు పాల్గొన్నాయి.



ఆంజనేయుడి వేషధారణలో కళాకారుడు



ప్యాలెస్ ముందు భక్తుల సందడి

మడికేరి దసరాలో లాఠీచార్జ్

దసరా ఉత్సవాలలో భాగంగా కొడగు జిల్లా మడికేరిలో లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. గురువారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర శుక్రవారం ఉదయం దాకా కొనసాగింది. శోభాయాత్రలో పాల్గొన్న బృందాలకు బహుమతుల పంపిణీ వేళ వివాదం చోటు చేసుకుంది. వ్యతిరేక నినాదాలు చేయడంతో చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. ఇదే సమయంలో డీఎస్పీ సూరజ్, హెడ్‌కానిస్టేబుల్ ఉదయ్‌లపైనా దాడి చేశారు. దీంతో వీరిని ఆసుపత్రికి తరలించారు. బహుమతుల ప్రదానంలో మోసం జరిగిందంటూ గొడవకు దిగారు. కాగా డీఎస్పీ సూరజ్‌కు బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రిలో చేర్పించినట్టు జిల్లా ఎస్పీ రామరాజన్ తెలిపారు. యక్షిత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

గ్యారెంటీలతో అధ్వానంగా మారిన

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

• వరద పరిహారం ప్రకటించలేని స్థితిలో ప్రభుత్వం : మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): గ్యారెంటీలతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారిందని మాజీ ప్రధాని దేవెగౌడ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారెంటీలకు ప్రాధాన్యం ఇచ్చి వేల కోట్లరూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఉత్తరకర్ణాటక జిల్లాల్లో వరదలతో ప్రజలు తల్లడిల్లుతున్నారన్నారు. కలబురగి, విజయపుర, బీదర్, యాదగిరి జిల్లాల్లో అపారనష్టం జరిగిందన్నారు. మరో వారం రోజుల్లో కలబురగితోపాటు వివిధ జిల్లాలను సందర్శిస్తానన్నారు. ఖజానాలో డబ్బులు లేవనే ఆరోపణలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్నారన్నారు. భీకరమైన వరద పరిస్థితిని నిభాయించేశక్తి ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. వరదలతో 50మందికిపైగా మృతి చెందారని పశువులు కొట్టుకుపోయాయన్నారు. పంటలు పూర్తిగా నాశనమయ్యాయని, రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయన్నారు. ఇటీవల సీఎం సిద్దరామయ్య వరదపీడిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపారని, అయితే ఏ విధమైన పరిహారం ప్రకటించారనేది తెలియదన్నారు. బీజేపీతో జేడీఎస్ మైత్రికి ఢోకాలేదని, రానున్న అన్ని ఎన్నికలలోనూ కలిసే పోటీ చేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తనకున్న సంబంధాలు ఎప్పటికీ మారవన్నారు. ఇటీవలి పదేళ్లలో ఒక్కసారి కూడా ప్రధానిమోదీని విమర్శించలేదన్నారు. బెంగళూరు పాలికె ఎన్నికల్లో 50-60స్థానాలు జేడీఎస్ ద్వారా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.



ఓటు చౌర్యానికి వ్యతిరేకంగా సంతకం చేస్తున్న రణదీప్‌సింగ్ సుర్జేవాలా, మంత్రి జార్జ్ తదితరులు

నాయకత్వ మార్పుపై చర్చలు లేవు: సుర్జేవాలా

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పుకు సంబంధించి ఎటువంటి చర్చలు జరగలేదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా స్పష్టం చేశారు. శుక్రవారం సదాశివనగర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నాయకత్వమార్పుపై ఎవరూ వ్యాఖ్యానించరాదన్నారు. ఇటీవల ఇద్దరు మాట్లాడిన మేరకు వారికి నోటీసులు జారీ చేశామన్నారు. మల్లికార్జున ఖర్గే ఆరోగ్యంగా ఉన్నారని ఎటువంటి సమస్య లేదన్నారు. పేస్ అమరిక తర్వాత ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కాగా పులకేశినగర్ నియోజకవర్గంలో బీజేపీ ప్రభుత్వం ఓటు చౌర్యంకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు సంతకాల చైతన్య కార్యక్రమం జరిగింది. ఏఐసీసీ కార్యదర్శి అభిషేక్ దత్తు, మంత్రి కేజే జార్జ్, పులకేశినగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్, కేపీసీసీ కార్యాధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుంభకర్ణుడి తరహాలో

రాష్ట్ర ప్రభుత్వం

• సిద్దరామయ్య అవుట్‌గోయింగ్ సీఎం
• సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయం : ప్రతిపక్షనేత అశోక్



బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరదలతో పది జిల్లాలు అతలాకుతలమయ్యాయని వారిని ఆదుకునే విషయంలో రాష్ట్రప్రభుత్వం కుంభకర్ణుడి తరహాలో నిద్రపోతోందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. శుక్రవారం బెళగావిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు జిల్లాల్లో వరదలతో ఇల్లు, ఆస్తులు కోల్పోయారన్నారు. ప్రభుత్వానికి వారికష్టం కంటే కులగణన మీదే ఆసక్తి పెరిగిందన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకే కుట్ర పన్నుతున్నారన్నారు. సిద్దరామయ్య అవుట్‌గోయింగ్ సీఎం అన్నారు. నవంబరు లేదా డిసెంబరులో రాష్ట్రంలో సంచలన రాజకీయాలకు తెరలేస్తుందన్నారు. నవంబరులో క్రాంతి చోటు చేసుకుంటుందని వ్యాఖ్యలు చేసిన మంత్రి రాజణ్ణ పదవిని కోల్పోయారన్నారు. ముఖ్యమంత్రి మార్పు తథ్యమన్నారు. రాజకీయంగా ఎంతటి క్లిష్టమైన పరిస్థితులు వచ్చినా జేడీఎస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేది లేదన్నారు. ఆపరేషన్ కమల చేసేది లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు పుష్కలంగా వీస్తున్నాయన్నారు.

అమ్మ చంపేసింది..!

• మానసిక స్థితి బాగోలేక బిడ్డను చంపి తల్లి ఆత్మహత్య

• అమ్మ వింతగా ప్రవర్తిస్తోంది.. రా నాన్నా.. • వీడియో కాల్ చేసిన కూతురు
• తేలిగ్గా తీసుకున్న తండ్రి.. వెళ్లేలోగా దారుణం • శివమొగ్గలో విషాదకర ఘటన



శ్రుతి (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నాన్నా..అమ్మ వింతగా ప్రవర్తిస్తోంది.. త్వరగా ఇంటికి రా అంటూ ఆ కూతురు తండ్రికి వీడియోకాల్ చేసింది. అయితే కాసేపు ఉండు తల్లి.. అంతా సర్దుకుపోతుంది అంటూ అతను సర్దిచెప్పారు. ఎప్పుడూ ఉండే ప్రవర్తనే కదా అని తేలిగ్గా తీసుకున్నారు. అయితే జరగాల్సిన దారుణం జరిగిపోయింది. కన్న బిడ్డను కిరాతకంగా చంపి ఆపై ఆత్మహత్యకు పాల్పడిన తల్లి ఉదంతం శివమొగ్గలో చోటు చేసుకుంది. శివమొగ్గ మెడికల్ కళాశాలలోని బోధనాసుపత్రి మెగ్గాన్‌లో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రామణ్ణ నాయక్ ఇంట్లో దారుణం జరిగింది. రామణ్ణ భార్య శ్రుతి ఆత్మహత్య చేసుకున్నారు. రామణ్ణ గురువారం రాత్రి డ్యూటీకి వెళ్లినప్పుడు, ఆరో తరగతి కుమార్తె పూర్వీక(14)ను తల్లి కొడవలితో నరికి హతమార్చింది. ఆ తర్వాత ఉరి వేసుకుని శ్రుతి(36) ఆత్మహత్యకు పాల్పడింది. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన రామణ్ణ తలుపు తడితే ఎంతసేపటికీ తెరవలేదు. సమీపవాసుల సహకారంతో తాళాలు బద్దలు కొట్టి లోపలికి వెళ్తే ఇద్దరూ మృతి చెందినట్లు గుర్తించారు. శ్రుతి మానసిక వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతున్నారు. రాత్రి 10.30 వేళ కుమార్తె పూర్వీక తండ్రికి వీడియోకాల్ చేసి తల్లి వింతగా ప్రవర్తిస్తోందని ఇంటికి రావాలని చెప్పింది. వెంటనే ఇంటికి రావాలని తండ్రిని కోరింది. డ్యూటీలో ఉన్నానని కాసేపటికి సర్దుకుంటుందని, కుమార్తెను బుజ్జగించాడు. ఉదయం వచ్చి చూసేసరికి కుమార్తె గొంతుభాగంలో కొడవలితో నరికిన గుర్తులు ఉన్నాయి. కన్నీరు మున్నీరయిన తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొడ్డపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



పూర్వీక (ఫైల్)

కొప్పళ విద్యార్థి ఎల్లాలింగ హత్య కేసులో


9 మందికి ఉపశమనం

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పదేళ్లక్రిందట రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించిన కొప్పళ జిల్లా విద్యార్థి ఎల్లాలింగ హత్యకేసులో 9మందికి ఉపశమనం లభించింది. కొప్పళ జిల్లా కోర్టు శుక్రవారం తీర్పును ప్రకటించింది. కనకగిరి తాలూకా కనకపుర గ్రామానికి చెందిన విద్యార్థి ఎల్లాలింగ స్వగ్రామంలో అవినీతి జరిగిందని బహిరంగంగా మాట్లాడారు. 2015 జనవరి 11న కొప్పళ రైల్వేస్టేషన్ సమీపంలో ఎల్లాలింగ మృతదేహం లభించింది. తొలుత ఆత్మహత్యగా భావించినా ఆ తర్వాత హత్యగా కేసు నమోదు చేశారు. మంత్రి శివరాజ్ తంగడగికి ఆప్తుడు హనుమేశ్‌నాయక్ సహా 9మందిపై కొప్పళ నగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లాలింగ హత్యకు న్యాయం జరగాలని రాష్ట్రస్థాయిలో పోరాటాలు జరిగాయి. శివరాజ్ తంగడగిని మంత్రి పదవి నుంచి తొలగించాలని అప్పట్లో తలెత్తింది. పదేళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత కొప్పళ జిల్లా కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. కాంగ్రెస్ నాయకుడు హనుమేశ్ నాయక, బాళనగౌడ, కాడమంజ, మహంతేశ్‌నాయక్, మనోజ్‌పాటిల్, నందీశ, పరశురామ, యమనూరప్ప, దుర్గప్ప కేసు నుంచి విముక్తి పొందారు. విచారణ జరుగుతున్న సందర్భంలోనే ఎల్లాలింగ ఆత్మహత్య చేసుకున్నాడని సోదరుడు తెలిపారు. వివాదాస్పద కేసు తీర్పుపై అందరికీ ఆసక్తి నెలకొని ఉండేది.

ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థుల మృతి

• పండగ వేళ విషాదం నింపిన సరదా

బాగేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పండగ వేళ మూడు కుటుంబాల్లో విషాదం మిగిలింది. చిక్‌బళ్లాపుర జిల్లా బాగేపల్లి తాలూకాలోని యల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆచేపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆచేపల్లి చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాత చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. విష్ణువర్ధన్ (14), నిహాల్‌రాజ్ (12), వివేకానంద పీయూ కళాశాల విద్యార్థి హర్షవర్ధన్ (16) మృతి చెందారు. దసరా సెలవుల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఈతకు వెళ్లారు. వీరిలో విష్ణువర్ధన్, నిహాల్‌రాజ్, హర్షవర్ధన్‌లు బురదలో చిక్కుకుని మృత్యువాత చెందారు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే చెరువు వద్దకు చేరుకున్నారు. విద్యార్థుల అకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాలను వెలికితీసి అంబులెన్స్ ద్వారా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆసుపత్రి ఆవరణకు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, తహసీల్దార్ మనీషా ఎన్ పత్రి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌వర్ధి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను ఆచేపల్లికి తరలించారు. ఘటనపై బాగేపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆచేపల్లి గ్రామంలో ముగ్గురు మృతి చెందడం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. తాను వ్యక్తిగతంగా తలా లక్ష రూపాయలు పరిహారం ఇస్తానన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,268	10,203
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13,961	10,176
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.38

దేహదానానికి అంగీకారం

● అంగీకార పత్రం అందజేసిన సంఘ సేవకుడు రామకృష్ణ



రామకృష్ణ

కంప్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకాలోని శ్రీరామనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త స్వామి వివేకానంద సేవా సంఘం అధ్యక్షుడు, కన్నడ ప్రేమికుడు రామకృష్ణ తన మరణానంతరం తన శరీరాన్ని కొప్పాళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు, తన కళ్లను కొప్పాళ్‌లోని ఎం జోషి కంటి ఆస్పత్రికి దానం చేస్తూ అంగీకార పత్రం అందజేశారు. రామకృష్ణ 45 సంవత్సరాలుగా విద్య, ఆరోగ్యం, సామాజిక, సాంస్కృతిక, కార్మిక మొదలైన కార్యక్రమాలకు నిరంతరం సేవలందిస్తున్నారు. ముఖ్యంగా పేదల సంక్షేమం కోసం ఉచిత వివాహాలు, పేద విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ మంచి ఉపాధ్యాయులకు సన్మానాలు యువజనోత్సవం, బాలల ఉత్సవం, సౌత్ గౌడ్స్ ర్యాలీలు, ప్రతి సంవత్సరం సామూహిక వన భోజనాలు, నిరుద్యోగ మహిళలకు కుట్టు యంత్రాలు డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు పాస్‌పోర్టులు, వికలాంగులు, వృద్ధులకు నెలవారీ వసతి, పేద కుటుంబాలకు ఉచిత సామూహిక వివాహాలు, పేదలకు, ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాలు, ఉచిత కంటి చికిత్స శిబిరాలు, వృద్ధులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం అనేక ఇతర సేవలతో ఆంధ్ర, తెలంగాణలో ఎంతో ఖ్యాతి సంపాదించారు. తన శరీరం, కళ్లు తన జీవితం తరువాత కూడా సమాజ ప్రయోజనాల కోసం ఉపయోగించబడాలని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ కంటి దానానికి ముందుకు వస్తే అంధత్వాన్ని పూర్తిగా నిర్మూలించ వచ్చన్నారు. ఆయన సంఘసేవపై పలువురు అభినందిస్తున్నారు.

బాపూ మార్గంలో నడుద్దాం

● గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రిని నిత్యం స్మరించుకోవాలి ● జయంతి వేడుకల్లో జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్



గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు



వీఎస్కేయూలో..

బళ్ళారి సిటీ/రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ సత్యం, అహింస మార్గంలో నడవాలని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ అన్నారు. గాంధీజీ 156వ జయంతి వేడుకల్లో భాగంగా జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ ,సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పాత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రవనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గాంధీజీ మనకు శాంతి, స్వేచ్ఛను ఇచ్చారని అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ హారీస్ అన్నారు. దానిని సద్వినియోగం చేసుకుని, సన్మార్గంలో నడవాలన్నారు. బళ్లారి జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ గాంధీజికి బళ్లారితో విడదీయరాని సంబంధం ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దూసుకెళ్లే ముందు ఆయన దేశవ్యాప్తంగా పర్యటించి సామాన ప్రజలను కలవాలని నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం ఆయన 1921అక్టోబర్ 1న మెదటిసారిగా బళ్లారిని సందర్శించారని, ఒక రాత్రి బళ్లారి రైల్వే స్టేషన్‌లో నిద్రించి మరుసటి రోజు దార్వాడ్‌కు ప్రయాణించారన్నారు. బాపూజీ మార్చి 1934న రెండవసారి బళ్లారి స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరించడానికి వచ్చారని ఇక్కడి నుండి సండూర్‌కు కూడా ప్రయాణించి అక్కడి అంటరాని వారిని కుమారస్వామి ఆలయంలోకి అనుమతించినందుకు అప్పటి ఘోర్పడే రాజకుటుంబాన్ని అభినందించారన్నారు. గాంధీజీ మరణాంతరం ఆయన ఆస్థికలను అప్పటి గాంధేయవాదులు కూడ్లిగి తాలూకా ఏకీకృత బళ్లారిగా ఉన్నప్పుడు అక్కడికి తీసుకువచ్చి అక్కడ ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించడం బళ్లారికి గర్వకారణమన్నారు. రిటైర్డ్ లెక్చరర్ బసవరాజు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మంచి పౌరుడిగా జీవించడానికి సామరస్యపూర్వక జీవితాన్ని గడపడానికి మహాత్మాగాంధీజీ 11సూత్రాలను అందించారని, మనమందరం వాటి ప్రకారం జీవించాల్సిన అవసరంఉందన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీసు సూరింటెండెంట్ నవీన్ కుమార్, కన్నడ సాంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు,పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, సమాచార ప్రజా సంబందాల శాఖ గురురాజ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అఖండ కర్ణాటక కార్యాలయంలో..

మోకా రోడ్డు ఎన్‌వీ కాంప్లెక్స్ కార్యాలయంలో అఖండ కర్ణాటక వాల్మీకి సంఘం కార్యాలయంలో వాల్మీకి రాజ్య అధ్యక్షుడు తిమ్మప్ప, జోళదరాసి జిల్లా మద్దమల్లయ్య నేతృత్వంలో గాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జయరామ్ అడ్వకేట్ బాదామి భాస్కర్ పరశురామ గురురాజ్, రుద్రమణి, అడ్వకేట్ గవిసిద్ధ, వాల్మీకి కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్ప బీజేపీ కార్యాలయంలో..

సిరుగుప్ప పట్టణ బీజేపీ కార్యాలయంలో తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గాంధీ భావచిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎంతో పోరాటం చేశారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఆయన తత్వ సిద్ధాంతాలను పాటించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి బసవరాజ,వీరన్నగౌడ, గంగాధర, శేకప్ప, మహాదేవ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అఖండ కర్ణాటక వాల్మీకి కార్యాలయంలో..



సిరుగుప్ప బీజేపీ కార్యాలయంలో..



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి జమీర్

సిలిండర్ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు మృతి

● రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన మంత్రి జమీర్



గంగమ్మ　హాలప్ప(ఫైల్)

బళ్లారి/బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గతనెల 27వ తేదీన విజయనగర జిల్లా, గాదిగనూరులో గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో గాయపడిన 11మందిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అయితే ఆసుపత్రిలో చికిత్స ఫలించక శుక్రవారం మృతి చెందారు. వీరిలో న్యాయవాది వృత్తిలో ఉన్న హాలప్ప(43), తల్లి గంగమ్మ(80) మృతి చెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హాలప్ప భార్య కవిత(35) పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని సంజీవిని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే వీరిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని చికిత్స కోసం బెంగళూరులోని విక్టోరి ఆసుపత్రికి తరలించగా, చికిత్స ఫలించక తల్లి, కొడుకులు కొన ఊపిరి వదిలినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం

గ్యాస్ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను బెంగళూరులో మంత్రి జమీర్ అహ్మద్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

వైభవంగా దుర్గమ్మ జంబూసవారి



గజరాజుపై దుర్గమ్మ



హాజరైన భక్తులు

కంప్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని గంగావతి తాలుకాలోని ఆనెగొంది, హేమగుడ్డ, దుర్గాదేవి, దసరా పండుగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం అమ్మవారిని జంబూ సవారి నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్ద వివిధ ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, అభిమానులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

వైభవంగా కాళికాదేవి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు



అలంకరణలో అమ్మవారు

పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీలో దసరా పండుగ పురస్కరించుకుని కాళికాదేవి అమ్మవారి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో పురోహితులు సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా భక్తాదులు రథోత్సవం తిలకించడానికి భారీగా తరలివచ్చారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా కంప్లి పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మన క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే

సిరుగుప్ప, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సదరుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పదవ వార్డులో 'మన క్లినిక్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మన క్లినిక్ నూతనంగా ఏర్పాటు చేశారు. ఆ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం పాలయినప్పుడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాకుండా ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వైద్యులు దమ్మూరు బసవరాజ, డాక్టర్ నాగప్రియ, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరగట్టు కర్రల సమరంలో ఇద్దరి మృతి



కర్రలతో కొట్టుకుంటున్న భక్తులు

బళ్లారి సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవంలో విషాదం చోటు చేసుకుంది. కర్రలతో పరస్పరం జరిగిన దాడుల్లో ఇద్దరు మృతి చెందారు. గురువారం జరిగిన ఈ కర్రల కొట్లాటలో ఇరు గ్రామాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డారు. వారిని వారిని అరికెర తిమ్మప్ప(45). ఆలూరు నాగరాజు (48)గా గుర్తించారు. వంత మందికి పైగా గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని కర్నూలు జిల్లా పోలీసు అధికారులు ప్రకటించారు.

కంటెయినర్ బోల్తా

పెనుకొండ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం తండా సమీపంలోని 44వ జాతీయరహదారిపై ఓ కంటెయినర్ అదుపుతప్పి బోల్తాపడింది. పోలీసులు తెలిపిన మేరకు బెంగళూరు నుంచి కియ పరిశ్రమవైపు వెళ్తున్న కంటెయినర్ వెంకటాపురం తండా వద్దకు రాగానే టైరుపగిలి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గెస్ట్ హౌస్.. గొర్రెలకు రెస్ట్ హౌస్

● ప్రారంభం కాకపోవడంతో నిరుపయోగంగా మారిన అతిథిగృహం

కంప్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన అతిథిగృహం వృథాగా మిగిలిపోయింది. రోజులు, నెలలు గడిచినా దీనిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. భవనం ప్రారంభం కాకపోవడం, కాపలా ఎవ్వరూ లేకపోవడంతో రాత్రివేళల్లో మద్యపానం సేవించే వారికి అడ్డాగా మారింది. గొర్రెల కాపరులు కూడా ఇక్కడే తమ గొర్రెలను నిలపుతున్నారు. ఎమ్మెల్యే పూర్తయిన అతిథి గృహాన్ని ప్రారంభించి అధికారులకు అనుగుణంగా ఏర్పాటయ్యేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పుడున్న అతిథి గృహం వర్షం వస్తే చాలు ఎక్కడ చూసినా వర్షపు నీరు కారుతోంది. నూతన అతిథి గృహాన్ని వినియోగించుకోవాలని నాయకులు కోరుతున్నారు.



హోసూరు జోన్

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష



సమీక్షా సమావేశంలో కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ తదితరులు

హోసూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్, సభ్యుల సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. కమిషన్ ఛైర్‌పర్సన్ పుదుక్కోటై విజయ అధ్యక్షత వహించారు. సభ్యులు మోనా మటిల్డా భాస్కర్, డాక్టర్ కాసిమిర్‌రాజ్, ఉషానందిని పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ తంగదురైలతో చర్చలు జరిపారు. లైంగిక వేధింపులకు గురైన పిల్లలను ఆసుపత్రిలో చేర్పించినప్పుడు వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి వెంటనే చికిత్సలు అందించాలని ఆమె సూచించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్లు రెన్యూవల్ చేసుకోని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హోసూరులో జోరు వాన



పట్టణంలో జోరుగా కురుస్తున్న వాన

హోసూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఏడాది పొడవునా దీని ప్రభావం కనిపిస్తుంది. హోసూరు పరిసర ప్రాంతాలలో కొన్ని వారాలుగా సాయంత్రం, రాత్రి వేళల్లో ఒకమోస్తరు వర్షం కురుస్తోంది. ఫలితంగా చలివాతావరణం మారిపోయింది. ప్రజలు స్వెట్టర్లు, టోపీలు ధరిస్తున్నారు. మరోవైపు జ్వరం, జలుబు, తలనొప్పి, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.

కారు ఢీకొని ఇద్దరు పాదచారుల మృతి



అదుపు తప్పిన కారు

హోసూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సమీపంలోని అట్టకురుక్కి సమీపాన కారు అదుపు తప్పి పాదచారులను ఢీ కొంది. శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కియా మహ్మద్ (38)కు భార్య శ్వేతాబాను, ఇద్దరు కుమారులు, ఒకు కుమార్తె ఉన్నారు. శ్వేతాబాను, రెండో కుమారుడు సమీర్‌లు ఇద్దరూ వాకింగ్ చేస్తుండగా ఒక కారు అదుపుతప్పి వీరిని ఢీ కొని పక్కనే ఉన్న గుంటలో పడిపోయింది. కేరళకు చెందిన స్పానిష్ నాయర్ తన కుటుంబంతో హోసూరుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనాస్థలంలోనే తల్లీకుమారుడు మృతి చెందారు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెకానిక్ కావేరి

● బైక్ రిపేరిలో రాణిస్తున్న యువతి ● నలుగురు సంతానంలో తానే తండ్రికి అండగా..



మోటారు సైకిల్ రిపేరిలో నిమగ్నమైన కావేరి

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏ పని గొప్పది కాదు... ఏ పని చిన్నది కాదు.. శ్రద్ధతో ఏ పనిచేసినా విజయం లభించడం తథ్యమని, కష్టపడి సంపాదించి తల్లితండ్రులను బాగా చూసుకుంటే తమ జీవనం సార్థకత అవుతుందని నిరూపించింది ఆ యువతి. బెళగామ్ జిల్లా పరిధిలోని బైలహొంగల తాలూకా బెళవడి గ్రామంలో గ్యారేజీలో పని చేస్తూ కావేరి ఎందరో ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపింది.

అమ్మాయిలకు ఆదర్శం

ఆడపిల్లలు ఈ పని చేయరాదు... ఆ పని చేయరాదు అనే కాలాలు పోయాయి. ఏ పనైనా చేయవచ్చు... అయితే అందుకు తల్లితండ్రుల ప్రోత్సాహం ఉండాలి, పనులపై నిమగ్నం, నిష్టత ఉంటే దేనిలోనైనా రాణించ వచ్చని మెకానిక్ కావేరి అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. వీరరాణి మల్లమ్మజియ బెళవడి స్వాభిమానం కలిగిన గడ్డ... ఇక్కడ ప్రతి ఇంటిలోనూ స్వాభిమానానికి మారుపేరు. పోరాట మనోభావంతో కష్టపడి పనిచేసి తినాలనే ఆదర్శ భావాలు కలిగిన పల్లెటూరు. వీటన్నిట నడుమ 19 ఏళ్ళ వయస్సు ఉన్న తాను తండ్రితో కలిసి గ్యారేజీ నడుపుతూ కుటుంబానికి ఆధార స్తంభంగా నిలుస్తున్నానంటోంది. తద్వారా మగపిల్లలే మెకానిక్ కావాలని భావనను కావేరి తుడిచి వేసింది. అంతేకాదు తన గ్యారేజికి వచ్చిన బుల్లెట్ లాంటి వాహనాలను నిర్భయంగా నడుపుతూ ఆడపిల్లలు దేనిలో తక్కువ కాదని నిరూపించింది.

తండ్రికి అండగా..

గత 30 సంవత్సరాలుగా బెళవడిల్లి కావేరి, తండ్రి ఆటోగ్యారేజి నడుపుతున్నారు. ఉదయ మేస్త్రి అంటేనే ఈ భాగంలో బాగా మంచి పేరున్న మెకానిక్. ఉదయ, భారతి దంపతులకు నలుగురు ఆడపిల్లలు, మొదటి ఇద్దరు ఆడపిల్లలకు వివాహమైంది. మూడో కూతురు కావేరి.. నాలుగో కూతురు ఇంకా ఆరవ తరగతి చదువుతోంది. తన తోటి స్నేహితులు కళాశాలకు వెళుతుంటే కావేరి మాత్రం ఎస్ఎస్ఎల్‌సీ సగానికి ఆపేసి తండ్రికి తోడుగా మెకానిక్ షాప్‌లో పని చేస్తూ కుటుంబ ఆర్థిక భారాన్ని మోస్తోంది. చిన్న వయస్సులోనే చెట్టుపై నుండి పడడంతో తండ్రి ఉదయ్‌కు కాలు విరిగింది. దీంతో బరువులు ఎత్తడానికి అతనికి సాధ్యం కాదు. తండ్రి కష్టం చూసిన కావేరి ఇంటిలో ఊరేకే కూర్చోకుండా మగపిల్లలతో సమానంగా టీ-షర్ట్, ప్యాంటు ధరించి చేతిలో స్పానర్, కటింగ్‌ప్లేయర్ పట్టుకుని బైక్ రిపేర్లు చేస్తోంది. తండ్రితో పాటు గత ఒకటిన్నర సంవత్సరం పాటు గ్యారేజీలో పనిచేస్తూ తండ్రికి ఆసరగా నిలుస్తుండడాన్ని చూసిన ప్రతి ఒక్కరు మెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం తన గ్యారేజీలో అన్ని రకాల మోటారు సైకిళ్ళ జనరల్ సర్వీసు, ఆయిల్ చేంజ్, కార్బొరేటర్ క్లీనింగ్, ఎయిర్ పిల్టర్ క్లీనింగ్, చైన్ సెట్టింగ్ లాంటి మోటారు సైకిల్ రిపేరికి సంబంధించిన అన్నిటిని సునాయసంగా చేస్తున్నట్లు, గేర్ బాక్స్, ఇంజన్ ఫిట్టింగ్ లాంటి సూక్ష్మమైన పనులు ఇంకా నేర్చుకోవాల్సి ఉందని కావేరి అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. ఉదయం 9.30గంటల నుంచి రాత్రి 10గంటల వరకు గ్యారేజీలోనే పనిచేస్తున్నట్లు, రోజుకు 10 బైక్‌ల వరకు రిపేరి చేస్తున్నట్లు కావేరి తెలిపింది. భవిష్యత్‌లో తన తండ్రి ఆశీర్వాదంతో గ్యారేజీని పెద్ద స్థాయిలో అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.



తండ్రి ఉదయ్ మేస్త్రీతో..

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మా రెమ్మ అమ్మవారికి గురు, శుక్రవారాలు విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేషంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బస్టర్ కీటన్ (జయంతి)



క్లాజిక్ హాలీవుడ్‌లో పేరొందిన అమెరికాకు చెందిన నటుడు జోసెఫ్ ఫ్రాంక్ కీటన్ (బస్టర్ కీటన్) 1895 అక్టోబరు 4న జన్మించారు. కమెడియన్‌గా, సినీ దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గా, స్టంట్ పర్‌ఫార్మర్‌గా రాణించారు. ప్రత్యేకించి మూకీ సినిమాలలో సత్తా చాటుకున్నారు. అభిమానులచే 'ది గ్రేట్ స్టోన్ ఫేస్'గా పిలవబడ్డారు. అకాడమీ హానరరీ అవార్డు గ్రహీత. 1966 ఫిబ్రవరి 1న కన్నుమూశారు. 2018 జూన్ 16న ఇంటర్నేషనల్ బస్టర్ కీటన్ సొసైటీ ఆయన గౌరవార్థం 'బస్టర్ కీటన్ డే'గా ప్రకటించింది.

కమలాకర కామేశ్వరరావు (జయంతి)



అలనాటి తెలుగు సినీ దర్శకుడు 'పౌరాణిక చిత్రబ్రహ్మ'గా పేరొందిన కమలాకర కామేశ్వరరావు 1911 అక్టోబరు 4న మచిలీపట్నంలో జన్మించారు. మూడు దశాబ్దాలలో 55 సినిమాలకు దర్శకత్వం వహించారు. తొలుత కృష్ణా పత్రికలో 'సినీ ఫాన్' పేరిట ఆయన రాసే రివ్యూలు ప్రామాణికంగా ఉండేవి. ఆయన దర్శకత్వం వహించిన 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలు నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రెసిడెంట్స్ సిల్వర్ మెడల్ సాధించాయి. 'గుండమ్మ కథ', 'నర్తనశాల' సినిమాలు ఎంతో పేరు తెచ్చాయి. 1998 జూన్ 29న కన్నుమూశారు.

ఏడిద నాగేశ్వరరావు (వర్ధంతి)



ప్రముఖ సినీ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు 1934 ఏప్రిల్ 24న తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో జన్మించారు. నాటక రంగం నుంచి సినీ నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ప్రవేశించి నిర్మాతగా స్థిరపడ్డారు. 'పూర్ణోదయ మూవీ క్రియేషన్స్' పతాకంపై ఉన్నత ఆశయాలతో నిర్మించిన శంకరాభరణం, స్వయంకృషి, సిరిసిరి మువ్వ, స్వాతి ముత్యం వంటి సినిమాలు రికార్డు సృష్టించాయనడంలో సందేహం లేదు. తెలుగు సినీ నిర్మాతల కౌన్సిల్‌కు కార్యదర్శిగా, నంది పురస్కారాల కమిటీ అధ్యక్షుడిగా, జాతీయ పురస్కారాల సమితిలో సభ్యుడిగా వ్యవహరించారు. 2015 అక్టోబరు 4న కన్నుమూశారు.

రిషబ్ పంత్ (పుట్టినరోజు)



క్రికెట్‌లో కుడిచేతి బౌలింగ్, ఎడమచేతి బ్యాటింగ్ చేసే రిషబ్ రాజేంద్రపంత్ 1997 అక్టోబరు 4న ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలో జన్మించారు. ప్రస్తుతం టెస్ట్ క్రికెట్‌లో జాతీయజట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నారు. ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ తరఫున ఆడారు. 2022 దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన సిరీస్‌కు భారతజట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా సత్తా చాటుకున్నారు. 2021లో ఉత్తరాఖండ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. బౌలింగ్ కుడిచేతి మీడియం ఫాస్ట్‌గాను, బ్యాటింగ్ ఎడమచేతి శైలి ఆయన ప్రత్యేకత. 2016లో అండర్-19 వరల్డ్‌కప్‌లో వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించారు. 18బంతులలో 50 పరుగులతో తన కెరీర్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేశారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 308 పరుగులు తీసి థర్డ్ యంగెస్ట్ ఇండియన్‌గా గుర్తింపు పొందారు. రంజీ మ్యాచ్‌లలోనూ ఆడారు. 2024లో టి20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కించుకున్నారు.

ఆటో ర్యాలీకి తరలిరండి

పెనుకొండ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు రూ.15వేలు అందించే కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగే ఆటో ర్యాలీలో తప్పక పాల్గొనాలని మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణదేవరాయల జైజంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు నిర్వహించే ఆటో ర్యాలీలో తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్లకు రూ.15వేలు దసరా కానుక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి కోరారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు హాజరు కావాలన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవాపథకం శనివారం ప్రారంభించనుంది. హిందూపురంలో ఆటోలతో రహమత్‌పురం సర్కిల్ నుంచి ప్రారంభించి ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తారు. అక్కడ సీఎం లైవ్ కార్యక్రమం ఉంటుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమానికి ఆటో ఓవనర్లు ప్రతి ఒక్కరూ రావాలన్నారు.

గోరంట్లలో చోరీ

గోరంట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ మెస్‌లో, మరోచోట ద్విచక్రవాహనాన్ని బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. మెస్ హోటల్ షట్టర్ తాళం బద్దలు కొట్టి క్యాష్ బాక్స్‌లోని రూ.500 చిల్లర ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అనంతరం షాదీమహల్ సమీపంలోని అయాజ్ ఖాన్‌కు చెందిన రూ.1.50 లక్షలు విలువైన పల్సర్ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా పరిశీలించి రెండు చోట్ల చోరీకి పాల్పడింది ఒకే వ్యక్తిఅని నిర్ధారించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ ఉత్సవాలు

పరిగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని బీరలింగేశ్వర ఆలయ మైదానంలో గురువారం ఉత్సవాను ఘనంగా నిర్వహించారు.

మైసూరులో రాజసం



సీఎం సిద్ధరామయ్య అభివాదం



యువనిధి పథకం నమూనా




గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్



మాదకద్రవ్యాల రహిత భారత్ నమూనా శకటం



పులివేష కళాకారుల బృందం



హంపి జూ శకటం

వైట్‌ఫీల్డ్‌లో విజయదశమి వేడుకలు



వేడుకలకు హాజరైన భక్తులు

మహదేవపుర, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరించుకుని వైట్‌ఫీల్డ్, కాడుగూడి చుట్టుపక్కల ప్రాంతాల 70కుపైగా గ్రామదేవతల పల్లకీ ఉత్సవం అంబేడ్కర్‌నగర్ గుట్ట దసరామైదానంలో ఘనంగా జరిగింది. పట్టందూరు అగ్రహార, కాడుగూడి, చన్నసంద్ర, ఏకేజీ కాలనీ, నాగొండనహళ్ళి, నల్లూరహళ్ళి, రామగొండనహళ్ళి, దిన్నూరు, బెళతూరు తదితర గ్రామాల దేవతలను పల్లకీలలో ఊరేగించారు. ఏకుమంద్యమ్మ, అంజనేయస్వామి, బసవేశ్వర స్వామి, శనిమహాత్మ, మునేశ్వర, మారమ్మ, సపలమ్మ, యల్లమ్మ, గంగమ్మ, దొడ్డమ్మ తదితర గ్రామదేవతలను పల్లకీలో ఊరేగించారు. డొళ్ళుకుణిత, కంసాళె, వీరగాసె తదితర కళాబృందాలు సందడి చేశాయి. వేలాదిమంది భక్త లు పాల్గొన్నారు. ఉత్సవసమితి అధ్యక్షుడు గుట్టెమారప్ప నేతృత్వంలో సభ్యులు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మంజుళా, మాజీ మంత్రి అరవింద లింబావళి, మాజీ ఎంపీ మునిస్వామి, బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, మహేంద్రమోది, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చేళూరులో వాసవీమాతకు పూజలు

చేళూరు(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో చివరిరోజు విజయ దశమిన చేళూరులో కన్యకా పరమేశ్వరిదేవికి వాసవిదర్బార్ అలంకరణ చేశా రు. గురువారం రాత్రి పురవీధులలో ఊరేగించారు. తొలుత ఉత్సవమూర్తికి అభిషేకం, అలంకరణ చేశారు. ఆర్యవైశ్యులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఉత్సవంలో ఎమ్మెల్యే మంజుళ, మాజీ మంత్రి లింబావళి తదితరులు

మారేనహళ్ళిలో విజయదశమి సంబరం..

శిడ్లఘట్ట(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మారేనహళ్ళిలో విజయ దశమిని పురస్కరించుకుని ఎస్ఎన్ క్రియాట్రస్టు అధ్యక్షుడు ఆంజినప్ప పుట్టు దంపతులు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు రాహుల్‌గౌడ వాయనం ఇచ్చారు. మహిళలకు పసుపు కుంకుమలు ఇచ్చి గౌరవించగా పురుషులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆంజినప్ప మాట్లాడుతూ అందరికీ దసరా సందర్భంగా శుభాకాంక్షలని, చాముండేశ్వరి దేవి ఆశీర్వాదం అందరికీ ఉండాలన్నారు. తనవంతు చేతనైన సాయం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభ, విశ్వనాథ, ఆనూర ఆనంద్, మునిరాజప్ప, మురళి, నాగేశ్, దడంఘట్ట కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

జేసీనగర్‌లో దసరా సందడి

హెబ్బాళ(ఆంధ్రజ్యోతి): జేసీ నగర్ దసరా ఉత్సవం వైభవంగా సాగింది. 101 గ్రామదేవతల మూర్తులను వేర్వేరు పల్లకీలలో స్థానిక పురవీధులలో ఊరేగించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం దాకా ఊరేగింపు కొనసాగింది. ఉత్సవాల నేపథ్యంలో స్థానిక మైదానంలో ప్రత్యేక వేదిక, రంగులరాట్నం ఇతరత్రా ఏర్పాటు చేశారు.



వాయనం ఇస్తున్న ఆంజినప్ప పుట్టు



చేళూరు పురవీధులలో ఊరేగింపు



బెంగళూరు సిద్దాపురలో వాసవీమాతకు అలంకరణ

మునిరెడ్డిపాళ్య ఉత్సవాల్లో లక్ష్మీనరసింహ మిత్రబృందం సేవలు



మునిరెడ్డిపాళ్య యువక బృందం సభ్యులు

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏటా జరిగే తరహాలోనే జేసీ నగర్‌లో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం ప్రారంభమైన దేవతల ఉత్సవాలు శుక్రవారం మధ్యాహ్నం దాకా కొన సాగాయి. మునిరెడ్డిపాళ్యకు చెందిన శ్రీలక్ష్మీనరసింహ మిత్రబృందం సభ్యులు, పదాధికారులు పాల్గొన్నారు. ఉగ్రనరసింహతో పాటు పలు శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలలో శ్రీవెంకటేశ్వర సంఘ అధ్యక్షులు పదాధికారులు, యువకులు పాల్గొన్నారు.

కావేరి హారతి అర్చకులకు సన్మానం



డీసీఎంతో అర్చకుల బృందం తదితరులు

బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా కేఆర్ఎస్ బృందావన్ గార్డెన్స్‌లో ఐదు రోజులపాటు కావేరి హారతి నిర్వహించిన 55మంది అర్చకులను సత్కరించారు. శుక్రవారం కుమారకృపలోని డీసీఎం అధికారిక నివాసంలో ప్రధాన అర్చకుడు విజయకుమార్ పండిట్‌తోపాటు అందరినీ సన్మానం చేశారు. ఎమ్మెల్యేలు శివలింగేగౌడ, మహంతేశ్ కౌజలగి, శరత్ బచ్చేగౌడ, జలమండలి చైర్మన్ డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్, ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ పాల్గొన్నారు.

ఉత్తమ జీవితం కోసం విలువలు పాటించండి



గౌరవ డాక్టరేట్లు పొందినవారితో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ఉన్నతవిద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్ తదితరులు

స్నాతకోత్సవంలో మంత్రి సుధాకర్

బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ జీవితం కోసం నైతిక విలువలు పాటించాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం జరిగింది. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సుధాకర్ మాట్లాడుతూ డిగ్రీతోనే చదువు పూర్తి కాదని పరిశోధనలు, ఆవిష్కరణలవైపు శ్రద్ధ చూపాలన్నారు. ప్రముఖ నటి భారతి విష్ణువర్ధన్, హోమియో వైద్యుడు బీటీ రుద్రేశ్, బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా, డాక్టర్ సరస్వతి, ఉమెన్ క్రికెటర్ వేద కృష్ణమూర్తి లకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేసి సత్కరించారు.

నేత్రదానంతో అంధత్వ నివారణ సాధ్యం : మంత్రి



ఆధునిక విధానాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేయడం ద్వారా దేశంలో అంధత్వ సమస్యను కొన్నేళ్లలోనే నివారణ సాధ్యం చేయవచ్చునని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె అభిప్రాయపడ్డారు. జయనగర్ వాసన్ ఐ కేర్‌లో కాన్‌స్టలేషన్ విజన్ సిస్టమ్, కాంటూర విజన్ లేసిక్ అనే అత్యాధునిక విధానాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో 88 లక్షలమంది అంధత్వం కలిగి ఉన్నారని, ఏటా దేశంలో 95లక్షలమంది మృతి చెందుతున్నారన్నారు. వారు మరణానంతరం మరొకరికి నేత్రదానం చేయాలని పిలుపునిచ్చారు. వాసన్ ఐకేర్ రీజనల్ డైరెక్టర్ ఆదర్శ్ ఎస్ నాయక్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే రామమూర్తి, నటుడు కేజీ ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి పల్లకి సేవ

ముళబాగిలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కొలదేవి గ్రామంలో కొలువైన కోదండరామస్వామి, దక్షిణేశ్వరస్వామి దేవతామూర్తుల పుష్పపల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. కొలదేవి, హోసహళ్ళి గ్రామాలలో ఊరేగింపు వేళ ఇళ్లముంగిట రంగవల్లులు వేసి స్వాగతించారు. తొలుత మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ నిర్వహించారు. అర్చకులు జీ శ్రీనివాస్, సుదీంద్రాచార్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు కొనసాగాయి. వివిధ కళాబృందాల కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.



గ్రామాలలో పల్లకీల ఊరేగింపు

హొంగసంద్రలో గాంధీ జయంతి వేడుకలు

బొమ్మనహళ్ళి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకుని హొంగసంద్ర, ఎంఎస్ఆర్ లే అవుట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఎస్ఆర్ లే అవుట్ వేడుకలలో స్థానిక మాజీ కార్పొరేటర్‌లు భారతి, రామచంద్ర పాల్గొని గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం రామచంద్ర మాట్లాడుతూ గాంధీ ఆశయాలు ఎంతో గొప్పవన్నారు. దేశస్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ సేవలను కొనియాడారు. అహింస, శాంతి ద్వారా స్వాతంత్ర్యం సాధించేందుకు కృషి చేశారన్నారు. హొంగసంద్రలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీజీ ఆశయాలు అనుసరణీయమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి శ్యామణ్ణరెడ్డి తెలిపారు. గాంధీజీ దేశానికి ఒక శక్తి అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ఆర్ లే అవుట్‌లో...



ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో...

ఉపాధి అడిగితే దౌర్జన్యం అంటారా?

● వాహన యజమానుల సంఘం నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కియ కార్లపరిశ్రమ రాకతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారాయి. అయితే తమ జీవితాల్లో మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని, ఉపాధికోసమని మా వాహనాలను అద్దెకు పెట్టుకోమని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఓ పత్రిక అంటోందని పెనుకొండ పట్టణ వాహనదారులు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో కారు ఓనర్లు, డ్రైవర్లు మాట్లాడుతూ బాడుగలు లేక ఇబ్బందులు పడుతున్నామని, మండలంలోని దుద్దేబండలో ఓహోటల్‌లో మా కార్లు అద్దెకు పెట్టుకోమని యూనియన్ తరుపున వెళ్లామని ఓ పత్రికలో మంత్రి అనుచరులు దౌర్జన్యం చేశారని రాయడం సిగ్గుచేటన్నారు. మాకు పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని జీవనోపాధి కోసం అడిగామని, ఇప్పటికైనా పలు పరిశ్రమల్లో, హోటళ్లలో స్థానికంగా ఉన్న వాహనాలను అద్దెకు పెట్టుకోవాలని కోరారు. ఈ ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. లేకపోతే తమకు న్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో వాహన యజమానులు శోభన్‌బాబు, శ్రీనివాసులు, మారుతి, వెంకటేశ్, రాజారెడ్డి, రవి, జగదీశ్, హరి, శీన పాల్గొన్నారు.